క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి దంపతులు

బొబ్బిలి: సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన సతీమణి చిన్నమ్మలుతో కలిసి దైవదర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శంకరరావు తదితరులు

రాజాం సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు ప్రజలను కోరారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని ఆగూరు, డీఆర్ఎస్ వలస గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు ఆయన సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం పథకాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, ఏపీవో కె.సాయిరాం పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో పంట దిగుబడి వివరాలు



ఆగూరులో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు

రాజాం: పంటకోత ప్రయోగాలతో పంట దిగుబడి వివరాలు తెలుస్తాయని ఏవో ఎ.రేణుకాసాయి అన్నారు. మండలంలోని ఆగూరులో ముగ్గురు రైతులకు చెందిన పంట పొలాల్లో పంటకోత ప్రయోగం సోమవారం నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, వెడల్పు విస్తీర్ణంలోని పంటపొలంలో ప్రయోగం చేపట్టగా, ఎకరాకు 27 బస్తాల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు ఓ అంచనాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వరి దిగుబడి ఆశాజనకంగానే ఉన్నట్లు ఆయన తెలిపారు.

108 సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన 108 సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్స్ సిబ్బందికి రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మేనేజర్ నాజిర్ హుస్సేన్ శిక్షణ అంశాలను వివరించారు. కొత్తగా వస్తున్న మార్పులు, సమాచార వ్యవస్థతో పాటు గుండె జబ్బుతో బాధపడే వారి పట్ల, ప్రసవ సమయంలో గర్భిణుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి డివిజన్ హెచ్‌లు ఉపేంద్ర, సాయి షణ్ముఖ్, ఓజేటి ఎ.శ్రీనివాసరావు, ఈఎంటీలు పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

బాడంగి: మండల పరిషత్ బడ్జెట్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు ప్రజాప్రతినిధులు ,మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సచివాలయం-4 పరిధిలోని లావేరు రోడ్, కొత్తగవిడివీధి, చెరువుగట్టు తదితర ప్రాంతాల్లో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నాయ కులు ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పథకాల మంజూరులో ఎలాంటి దళారీ వ్యవస్థ, రాజకీయ ప్రమేయం లేదన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, నాయకులు పతివాడ రాజారావు, ఇప్పిలి గోవింద, ఎల్.ప్రభాత్, గవిడి కల్కి, రఘుపాత్రుని శివ, శ్రీను, ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



రాజాం సిటీ: కొండంపేట శివాలయం వద్ద చెరువులో భక్తుల దీపారాధన

కార్తీక సోమవారం పురస్కరించుకుని, శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు దైవదర్శనానికి గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, దీపారాధనలు చేశారు. వాడవాడలా జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంతో శివనామస్మరణ మార్మోగింది.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: అలజంగిలో ప్రత్యేకాలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి



వంగర: సంగాంలో సంగమేశ్వరుని దర్శనానికి బారులుతీరిన భకులు



సంతకవిటి: సంతకవిటి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బాడంగి: శివాలయంలో నందీశ్వరునికి పూజలు చేస్తున్న మహిళలు



తెర్లాం: కొరటాం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామభద్రపురం: తారాపురం శివాలయంలో భక్తుల పూజలు



వంగర: అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు



రేగిడి: గుళ్లపాడు శివాలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు

'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు చేపట్టాలి

బాడంగి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి, క్రీడాకారుల పేర్ల రిజిస్ట్రేషన్ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి పి.సూర్యారావు సూచించారు. స్థానిక సచివాలయంలో వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామీణ క్రీడాకారుల్లోని క్రీడాప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమ విజయవంతానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఏదైనా క్రీడ ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్న 15 ఏళ్లు దాటిన యువత పేర్లు నమోదు చేయాలని వలంటీర్లకు తెలిపారు. డిసెంబరు 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశముందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ కార్డుల కుటుంబాల్లోని ప్రతిఒక్కరితో ఈకేవైసీ చేయించాలని తెలిపారు.

అలరించిన సంగీత కచేరి



ఆకట్టుకున్న వీణావాయిద్య ప్రదర్శన

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం చేపట్టిన సంగీత కచేరి ప్రేక్షకులను అలరించింది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, భారత నాటక అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కచేరీలో ప్రముఖ కళాకారులు భమిడిపాటి కనకదుర్గాప్రసాద్ చేసిన వీణావాయిద్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. కళలకు పుట్టినిల్లు అయిన బొబ్బిలిలో ఈ తరహా కార్యక్రమం చాలారోజుల తర్వాత జరగడంతో చూసి, ఆనందించేందుకు ప్రజలు ఉవ్విళ్లూరారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు, కళాకారులకు సన్మానించారు.

• బస్‌షెల్టర్ ప్రారంభం



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామ కూడలి వద్ద కొత్తగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన బేరి గణపతి తన తండ్రి సంగంనాయుడు జ్ఞాపకార్థం రూ.2.5 లక్షల వ్యయంతో ఈ బస్‌షెల్టర్‌ను నిర్మించగా, ఆయనను ఎమ్మెల్యే పిలిచి మరీ అభినందించారు. గ్రామాభివృద్ధికి దాతల సహకారం ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా యువత ప్రజాసేవకు ముందుకు వస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస రామచంద్రినాయుడు, సర్పంచ్ బేరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడదాం

శృంగవరపుకోట: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని స్థానిక సెకెండ్ క్లాస్ మున్సిఫ్ కోర్టులో న్యాయమూర్తి సబ్బవరపు వాణి ఆధ్వర్యంలో సోమవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని న్యాయవాదులు,ఉద్యోగులతో జడ్జి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ అందరూ రాజ్యాంగానికి బద్ధులై, రాజ్యాంగాన్ని గౌరవించాలని పిలుపునిచ్చారు. బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎస్.శర్మ, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, ఎం.చంద్రశేఖర్, బి.వి.ఎస్.రామారావు, బి.సత్యనారాయణ, ఎలమంచిలి ప్రసాద్, టి.వి.ఆర్.మూర్తి, సీహెచ్.ఆర్.ఏ.నాయుడు, బి.వెంకటరావు, బి.శివశేఖర్‌బాబు, శేఖర్, ఎం.అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.



కోర్టులో న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తి వాణి

30న మానవతా సేవా సంస్థ ఏర్పాటు

రాజాం సిటీ: సమాజ సేవే లక్ష్యంగా ఈ నెల 30వ తేదీన స్థానిక పట్టణంలో మానవతా సేవా సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక పట్టణంలో సంస్థ వివరాలు, లక్ష్యాలు తెలిపే కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణ, రక్తదానం, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నైతిక విలువల బోధన, ఉచిత వైద్యశిబిరాలు వంటివి నిర్వహించనున్నామన్నారు.

చోడిసాగుపై దృష్టిసారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రేగిడి: చోడిసాగుపై రైతులు దృష్టిసారించాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని పోరాం, కాగితాపల్లి, ఉనుకూరు, సరసనాపల్లి గ్రామాల్లోని రైతులకు చోడి పంట సాగు చేసే విధానంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ పంటను సాగుచేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుందన్నారు. ఉడుపు, లైన్ షోయింగ్ ద్వారా మాత్రమే విత్తనాలు నాటుకోవాలని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల కార్తీక వనసమారాధన రేపు

చీపురుపల్లి: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక సమారాధన, సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పాట్నూరు సత్యం , ప్రధాన కార్యదర్శి అంపో లు సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న మామిడి తోటలో ఉదయం 8 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 73 ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులను సత్కరించనున్నట్లు తెలిపారు. చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో ఉన్న విశ్రాంత ఉద్యోగులంతా కుటుంబ సభ్యులతో కలిసి హాజరు కావాలని కోరారు.

సోంపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

మేపాడ: మండలంలోని సోంపురంలో బొద్దాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కె.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించా రు. శిబిరంలో 127 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ టెస్ట్ నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంత రం వైద్య సిబ్బంది గ్రామంలో గృహసందర్శన చేసి అనారోగ్య సమస్యలతో మంచాలకు పరిమితమైన రోగులకు వైద్యసేవలందించారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు, పక్కనే జెడ్పీటీసీ సరస్వతి

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమైన వారు 2024 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ఇంటింటికీ వెళ్లి, వివరించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అందరూ పాలుపంచుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం జరుగుతోందని, ఇదే విషయాన్ని లబ్ధిదారుల వద్దకు వెళ్లి తెలియజేయాలన్నారు. అలాగే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడీపీ హయాంలో ప్రజలు మోసపోయిన తీరును గుర్తు చేస్తూ వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన మేలును పదేపదే తెలియజేయాలన్నారు. మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని, ఆ దిశగా నేతలు, కార్యకర్తలంతా పని చేయాలని కోరారు. సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, నేతలు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, అప్పికొండ నిర్మల, కనిమెరక అప్పారావు, పువ్వల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యల పరిష్కారం

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజాసమస్యలు పరిష్కరించడం జరుగుతోందని ఎంపీడీవో శంబంగి రామకష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యల పరిష్కారానికి పలువురు సమర్పించిన వినతిపత్రాలను ఆయన స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.



తెర్లాం: ఎంపీడీవోకు దరఖాస్తు అందజేస్తున్న జయలక్ష్మి

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజాసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల సమస్యలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. పన్నులను సకాలంలో వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: సమస్యల పరిష్కారానికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

రాజాం: స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ అర్జీలోని సమస్యను పరిష్కరించాలని పంచాయతీ విస్తరణాధికారి వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు పలు శాఖల అధికారులతో సమావేశమైన ఆయన స్పందన సమస్యల పరిష్కారం, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. వికసిత్ భారత్ సంకల్ప్ కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మణరావు, జేఈలు ప్రభాకరరావు, వి.జగన్మోహనరావు, ఏపీవో సాయిరాం, ఏపీఎం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్ష లేని సమాజం నిర్మిద్దాం



రాజాం మెయిన్‌రోడ్డులో మానవహారం చేపట్టిన మహిళా సంఘాల సభ్యులు

రాజాం: లింగవివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దామని వైఎస్సార్ క్రాంతి పథం రాజాం ఏసీ ఎ.చిరంజీవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవంలో భాగంగా స్థానిక పట్టణంలోని అమ్మవారి కాలనీ వద్ద మహిళా సంఘాల సభ్యులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. లింగవివక్ష వద్దు.. సమసమాజమే ముద్దు.. పురుషులతో సమానంగా స్త్రీలను చూడాలని నినాదాలు చేశారు. అనంతరం మానవహారం చేపట్టి ఆడ,మగ ఇద్దరూ ఒక్కటేనని లింగవివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెండర్ కార్యక్రమ పర్యవేక్షణ అధికారి కె.హేమలత, ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు సామంతుల అరుణ, సీసీలు, వీఓలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

శీతాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

రామభద్రపురం: శీతాకాలంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు ఏఎల్‌జి శిరీష, అపర్ణ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడుతూ శీతలగాలులతో పాటు తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మంచు కురుస్తుండంతో ఆస్తమా, గుండె, ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారు కూడా మంచులో ఎక్కువగా తిరగవద్దన్నారు. నెలల బిడ్డలు తల్లి పొత్తిలిలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడాదిలోపు పిల్లలకు చలిగాలి తగలకుండా చూసుకోవాలన్నారు. చలి వల్ల ఫిట్స్ కూడా వచ్చే ప్రమాదముందన్నారు. ప్రయాణాలలో చిన్నపిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలన్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు మఫ్లర్, స్వెట్టర్‌తో పాటు షూ వేసుకోవాలని, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు, గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలున్నాయని, తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఏవైనా అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీ వైద్యాధికారులు శిరీష, అపర్ణ